గొల్లపూడి కాలమ్

జీవితం–కళ

ఆ మధ్య ఎవరో అడిగారు:'నేటి సినీమాలు ఎలా వుంటున్నాయి?'అని. తడుముకోకుండా సమాధానం చెప్పాను:'మన జీవితాల్లాగ వుంటున్నాయి'అని.

'మరి మన జీవితాలు ఎలా వుంటున్నాయి?' అన్నది ప్రశ్న.

చటుక్కున సమాధానం చెప్పవచ్చు:'సినీమాల్లాగ వుంటున్నాయి'అని.

విత్తు ముందా చెట్టు ముందా అన్న ప్రశ్న లాగ– ఏది ఎవర్ని ప్రభావితం చేస్తోందో విజ్ఞులు కూర్చొని తేల్చాల్సిన విషయం– తేల్చుకోవల్సిన విషయం.

ఈ మధ్యనే నలుగురు కుర్రాళ్ళు మద్రాసులో అర్ధరాత్రిదాకా తప్పత్రాగి, తమతోపాటు వున్న(?) స్టిఫానీ అనే అమ్మాయిని వెంటదరిమారు.(ఆమె స్కూటర్ మీద పోతోంది.)కథ అక్కడే ముగిస్తే– అది సరదాగా,సినీమాగా సరిపెట్టుకోవచ్చు. కాని కారు స్కూటర్‌ని గుద్దింది. స్కూటర్‌మీద అమ్మాయి కారు కింద పడింది. పడినట్టు వాళ్ళకి తెలీదు. మళ్ళీ కారులో ఆ అమ్మాయిని తొక్కారు. ఆ అమ్మాయి అక్కడికక్కడే చచ్చిపోయింది. ఇది భీభత్సం.

జీవితం కళని అనుకరించి భయంకరమైన విశ్వరూపం దాల్చిన సంఘటన ఇది.

దాదాపు 30 యేళ్ళ కిందట నేనో సినీమా రాశాను. దాని పేరు 'మరపురానితల్లి'.అందులో వాణిశ్రీ హీరోయిన్. కృష్ణ హీరో. గుల్షన్ నందా నవల ఎంతో కొంత ప్రభావితం చేసిందనుకొంటాను. మొదటి భర్తకి బిడ్డ. రెండో భర్తతో కాపురం– యిలాంటిదేదో.

ఆ రోజుల్లో అది బాగా విజయం సాధించిన చిత్రం. 'మారుతీరావు ఉచ్చులు బాగా బిగిస్తాడు. ఇదో అభూత కల్పన. సినీమా మాత్రం సరదాగా వుంది' అన్నాడొకాయన.

ఇప్పుడు నిజం కథ. నిజ జీవితంలో కథ. ఆసిఫ్ అనే సిపాయి కార్గిల్ యుద్ధానికి వెళ్ళాడు. శత్రువుకి దొరికాడు. పాకిస్థాన్ జైల్లో పడ్డాడు. యుద్ధంలో పోయాడనుకొన్నారంతా. యుద్ధానికి వెళ్ళడానికి కేవలం పది రోజులముందే ఆతనికి పెళ్ళయింది. నాలుగేళ్ళు ఆచూకీ తెలియకుండా పోయాక– భార్య గుడియా ఆ కుటుంబంలోనే ఓ దూరపు బంధువు –తోఫిక్‌ని– పెళ్ళి చేసుకొంది. గుడియా గర్భం దాల్చింది. ఇప్పుడు ఆసిఫ్ పాక్ జైలునుంచి వచ్చాడు. ఇంతకన్న అద్భుతమయిన సినీమా మరొకటిలేదు. నేను మరుపురానితల్లి సినీమాని 30 ఏళ్ళ ముందే రాశాను!

ఇప్పుడు గుడియా ఎవరితో కాపురం చెయ్యాలి? ఆసిఫ్ అంగీకరిస్తే ఆతని దగ్గరే బ్రతుకుతా నంది. మరి కడుపులోవున్న బిడ్డ? 'ఇది తోఫిక్ బిడ్డ. పెంచుతాను. పెద్దయ్యాక తోఫిక్

బిడ్డని తీసుకువెళ్ళవచ్చు' అంది.

ఇంత కంటె గంభీరమైన ముగింపు ఈ కథకి మహేష్ భట్ కానీ, బాలచందర్ కానీ, విశ్వనాథ్ కానీ ఇవ్వలేరు. నిజానికి మహేష్ భట్ ఈ సంఘటనకి స్పందించి 'ఎవరితో బ్రతకాలో నిర్ణయించుకొనే హక్కు గుడియాకే వుంది. ఆ బిడ్డ భగవంతుడిచ్చిన వరం. ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు'అన్నారు.

నాకు మళ్ళీ థామస్ హార్డీ 'ది మేయర్ ఆఫ్ కాస్టర్‌బ్రిడ్జి' జ్ఞాపకం వస్తోంది.( ఆ నవలనీ నేను తెలుగులో రాశాను 'పరాజితుడు' పేరిట.)

జీవితం ఒక్కొక్కప్పుడు కళ కంటె విడ్డూరంగా వుంటుంది. గుండెల్ని ఆర్ద్రం చేసేంత ఉదాత్తంగానూ వుంటుంది. ఆయితే కళ- మొన్న మద్రాసు రోడ్లమీద నలుగురు కుర్రాళ్ళనీ తాగుబోతుల్నీ, హంతకుల్నీ చేసినప్పుడు-(ఎక్కువగా ఆదే జరుగుతోంది)- ఎవరయినా, ముఖ్యంగా 'మీడియమ్' పెద్దలు గమనిస్తున్నారా ఆని భయం కలుగుతుంది. గుండె వణుకుతుంది. కళ ప్రస్తుతం నరాల్ని మాత్రమే రెచ్చగొడుతోంది. హృదయాన్ని స్పందింపజేయడం లేదు. నరాల మత్తు రోడ్డు మీద హత్య దగ్గరే ముగుస్తుంది. హృదయ స్పందన గిడియా చిత్తశుద్ధి దాకా ప్రయాణంచేస్తుంది.

(రచయితని www.gollapudimaruthirao.com లోకలుసుకొన వచ్చును)